అసంఘటిత రంగ కార్మికులను ఆదుకోవాలి

- ఈ శ్రమ్ పథకంలో చేర్చి నిధులివ్వాలి
- ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య



మాట్లాడుతున్న రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య

ఒంగోలు సిటీ: అసంఘటిత రంగ కార్మికులందరినీ ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. ఈ శ్రమ్ పథకంలో చేర్చి నిధులు కల్పించి కార్మికులను భాగస్వాములను చేయాలని కోరారు. శనివారం ఉదయం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సయ్యద్ యాసిన్ అధ్యక్షత వహించగా, వెంకటసుబ్బయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికవర్గం పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. విశాఖ ఉక్కు కర్మాగార మనుగడకు ఇచ్చిన రూ.11,400 కోట్లు కంటితుడుపు చర్య మాత్రమేనని అన్నారు. సొంత గనులు కేటాయించి సేయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మిక హక్కులు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్ని యూనియన్ల బాధ్యులు కార్మికులను విరివిగా యూనియన్లలో చేర్పించాలని కోరారు. యూనియన్ లేని రంగాలలో కొత్త యూనియన్లు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ శ్రమ్ కార్డులో కార్మికులందరినీ చేర్పించాలని కోరారు. యూనియన్ సహాయ కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసరావు పథకం వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటరావు, రాష్ట్ర హమాలీ కార్మిక ఉపాధ్యక్షుడు కె.శుభాన్ నాయుడు, మార్కాపురం, కనిగిరి, వై.పాలెం, కొండపి, ఒంగోలు నగరంలోని అన్ని యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

బూచేపల్లిని కలిసిన వైఎస్సార్ సీపీ శ్రేణులు


బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డిని సత్కరిస్తున్న మన్నం శ్రీధర్‌బాబు

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించబడిన మన్నం శ్రీధర్‌బాబు శనివారం చీమకుర్తిలోని బూచేపల్లి నివాసంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాదరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తనను నియమించిన సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, పార్టీ రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలకు గుణపాఠం చెప్పాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఐపీఎస్ సునీల్ కుమార్

- ఐపీఎస్ పీవీ సునీల్ కుమార్

ఒంగోలు వన్‌టౌన్: మాలలంతా తమ ఓటుతో రాజకీయ పార్టీలకు గుణపాఠం చెప్పాలని సీనియర్ ఐపీఎస్ పీవీ సునీల్ కుమార్ పిలుపునిచ్చారు. ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం మాల ఉద్యోగులు, మాల సంఘాల అత్యవసర సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాలు సబ్‌ప్లాన్ నిధులను ఎస్సీల అభివృద్ధికి ఖర్చు చేయడం లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ అనేది అగ్ర కులాల పన్నాగమన్నారు. ఏపీలో 2011లో జనాభా లెక్కించారని, అప్పటి జనాభా లెక్కల ప్రకారం వర్గీకరణ చేస్తామంటే కుదరదని అన్నారు. ఏపీలో అత్యధిక జనాభా ఉన్న ఒకే ఒక్క కులం మాల కులమని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మాల ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం మాలలకు నష్టం కలిగించే చర్యలు తీసుకుంటే ఉద్యమ బాట పడతామన్నారు. రాజధానిలో మాలలతో బ్లూ మార్చ్ అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మాల జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు అన్నవరపు కిషోర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పందుల అశోక్, డాక్టర్ కె.జగదీష్, మహిళా నాయకులు రమణకుమారి, జ్యోనిమేరి, జిల్లా అధ్యక్షుడు హనుమంతరావు, గోపీనాథ్, మల్లికార్జునరావు, జనార్దన్, శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం బాలోత్సవం కోసం వర్క్‌షాప్

- పేర్ల నమోదుకు 12 వరకు గడువు పొడిగింపు


మాట్లాడుతున్న బాలోత్సవం అధ్యక్షుడు బండారు లక్ష్మీనారాయణ

ఒంగోలు సిటీ: స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 15, 16 తేదీల్లో జరిగే ప్రకాశం బాలోత్సవం కోసం వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు బాలోత్సవం అధ్యక్షుడు బండారు లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రకాశం బాలోత్సవ కార్యక్రమం నిర్వహణపై ఒంగోలులోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో బాలోత్సవం ప్రధాన కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం అధ్యక్షతన శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. వివిధ రకాల ఈవెంట్లకు కన్వీనర్లు, కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి 500 మంది బాధ్యులుగా వ్యవహరిస్తున్నారని లక్ష్మీనారాయణ తెలిపారు. పిల్లల కోసం పెద్దలు, మేధావులు, విద్యావేత్తలు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో జరిగే రుగ్మతలను చీదరించుకుంటే సరిపోదని, అవి పిల్లలపై పడకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. బాలోత్సవం రాష్ట్ర కన్వీనర్ రామరాజు మాట్లాడుతూ ఈ కార్యక్రమం నిర్వహణలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొనడానికి ముందుకు రావాలని కోరారు. వివిధ రంగాల్లో నైపుణ్యం కలిగిన వారంతా ముందుకు రావాలని కోరారు. రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమాలను జయప్రదం చేసేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షుడు డి.వీరాంజనేయులు, కోశాధికారి ఎస్.రవి, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజీ శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్లా హై, బాలోత్సవ నాయకులు బాలకోటయ్య, వినోద్, బాబు పాల్గొన్నారు.

11న జిల్లా సంగీత, నాట్యకళా వైభవం


కరపత్రాల ఆవిష్కరణలో ఘంటసాల స్వరాంజలి కమిటీ సభ్యులు

ఒంగోలు మెట్రో: ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, రాష్ట్ర సృజనాత్మక సాంస్కృతిక సమితి, పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి వారి ఆధ్వర్యంలో ఘంటసాల వర్ధంతి సందర్భంగా ఈనెల 11వ తేదీ ప్రకాశం జిల్లా సంగీత, నాట్య కళా వైభవం కార్యక్రమం స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించనున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు పద్మశ్రీ ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన పాటలతో ఈ కార్యక్రమం జరుగుతుంది. ఏడు గంటలకు ముఖ్య అతిథులతో సభా కార్యక్రమం ప్రారంభమవుతుంది. 40 మంది గాయనీ గాయకులు, 15 మంది నృత్య కళాకారులు పాల్గొంటున్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి గౌరవాధ్యక్షుడు మండవ మురళీకృష్ణ శనివారం ఆవిష్కరించారు. కరపత్ర ఆవిష్కరణలో డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ, చాందిని వెంకటలక్ష్మీ మనోహర్, చందు పాల్గొన్నారు. అభిమానులంతా పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

నేడు పూర్వ విద్యార్థుల కలయిక

సంతనూతలపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. హైస్కూల్ ఆవరణలో 25 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు కలుసుకోనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఢిల్లీలో బీజేపీ గెలుపుపై సంబరాలు

సంతనూతలపాడు: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై సంతనూతలపాడులో బీజేపీ మండల అధ్యక్షుడు బాలినేని కళ్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సంబరాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఢిల్లీలో బీజేపీ విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంకే సుబ్బారావు, తెల్లమేకల శ్రీనివాసరావు, బాలినేని చెంచిరెడ్డి, మన్నం రామారావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

ఒంగోలు మెట్రో: జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో మయూరి ఆర్కెస్ట్రా, ఈవెంట్స్ ఒంగోలు వారి ఆధ్వర్యంలో జరిగిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. కీ బోర్డు ఆర్టిస్ట్ ఇర్మియ ఆధ్వర్యంలో జరిగిన సినీ సంగీత విభావరిలో గాయకులు రాజేష్, శైలజ, యశోద, హరిబాబు, సాగర్, అశోక్, ఉషారాణి, రాఘవయ్య తదితరులు ఆలపించిన గీతాలు శ్రోతలను మంత్రముగ్ధులను చేశాయి. ఆనవాయితీగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఈ నెలలో మరణించిన రంగస్థలం ప్రముఖులు ఘంటసాల వెంకటేశ్వరరావు, ఈలపాట రఘురామయ్య, షణ్ముఖి ఆంజనేయరాజు, షేక్ నాజర్ వర్ధంతులు, జిల్లా అవతరణ దినోత్సవం గురించి చిట్టా వెంకట శివప్రసాద్, కనుమల రాఘవులు, ధేనువకొండ సుబ్బయ్య తదితరులు మాట్లాడారు. నిర్వాహకులుగా జిల్లా రంగభూమి కళాకారుల సంఘ ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, సభ్యులు నరేంద్ర, రంగారావు తదితరులు వ్యవహరించారు.


కార్యక్రమంలో పాల్గొన్న గాయకులు, నిర్వాహకులు

ఏళ్ల తరబడి పొజిషన్ చూపించలేదు

- 150 సంవత్సరాలుగా కొండలో రాళ్లు కొట్టుకుంటూ జీవిస్తున్నాం
- 35 సంవత్సరాల క్రితం పట్టాలిచ్చినా ప్రయోజనం లేకుండా పోయింది
- ఒంగోలు ఎమ్మెల్యే దామచర్లతో గోడు వెళ్లబోసుకున్న ఒంగోలు విజయనగర్ కాలనీ మహిళలు


ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే దామచర్ల ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు

ఒంగోలు సబర్బన్: ముప్పై ఐదు సంవత్సరాల క్రితం ఇళ్ల పట్టాలిచ్చారుగానీ పొజిషన్ చూపించలేదంటూ ఒంగోలు విజయనగర్‌కాలనీ, వడ్డెపాలేనికి చెందిన మహిళలు తమ గోడు వెళ్లబోసుకున్నారు. స్థానిక వడ్డెపాలెంలో శనివారం ఒంగోలు తహసీల్దార్ ఎస్.వాసు, ఒంగోలు నగర పాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. మామిడిపాలెం గ్రామ సర్వే నంబరు-63/1లో కొండకు ఆనుకుని ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి అక్కడే ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత కొండపోరంబోకు ప్రాంతాన్ని దామచర్ల పరిశీలించారు. అనంతరం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో స్థానిక మహిళలు తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తం చేశారు. పొనుగుపాటి కోటేశ్వరరావు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 60 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు పొజిషన్ చూపించలేదని తెలిపారు. దానికితోడు ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్జీఓల వద్ద ప్రభుత్వం డబ్బులు కట్టించుకుని 3 ఎకరాలకుపైగా వాళ్లకు పట్టాలిచ్చేందుకు పూనుకున్నట్లు తెలిపారు. అందువల్ల వివాదం చెలరేగి కోర్టు వరకు వెళ్లి ఇళ్ల స్థలాల విషయం ఆలస్యమైందని వివరించారు. 35 సంవత్సరాల క్రితం 60 కుటుంబాలకు పట్టాలిస్తే ప్రస్తుతం ఆ కుటుంబాలు కాస్తా 300 కుటుంబాలకుపైగా ఏర్పడ్డాయని, అందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు. దామచర్ల మాట్లాడుతూ ఈ సర్వే నంబరులోని 5 ఎకరాలను లెవలింగ్ చేయాలని, రోడ్లు ఏర్పాటు చేసి గ్రావెల్ కూడా తోలి చదును చేయాలని మున్సిపల్ ఇంజినీర్ పెంచలయ్యను ఆదేశించారు. 15 రోజుల్లో పూర్తి చేస్తే ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా పొజిషన్ చూపించి వాస్తవ లబ్ధిదారులు ఉంటే ఇళ్లపట్టాలిచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రొటోకాల్ పాటించని అధికారులు...

రెవెన్యూ, ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులు సంయుక్తంగా విజయనగర్ కాలనీలోని కొండ సమీపంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌లో ప్రొటోకాల్ పాటించలేదు. అధికారిక కార్యక్రమం అయినప్పటికీ స్థానిక ప్రజాప్రతినిధికి కనీసం ఆహ్వానం కూడా లేకుండా నిర్వహించారు. స్థానిక 31వ డివిజన్ కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతికి కనీస సమాచారం కూడా ఇవ్వకుండా ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించిన అధికారుల తీరుపై విమర్శలు గుప్పుమంటున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాన్ని పార్టీ కార్యక్రమం మాదిరిగా అధికారులు నిర్వహించడాన్ని పలువురు తప్పుబడుతున్నారు.

ఉత్సాహంగా క్విస్ కాలేజీ ఫెస్ట్

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- సందడి చేసిన ప్రముఖ సింగర్ సమీర భరద్వాజ్


ఖోఖో పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఒంగోలు సిటీ: స్థానిక క్విస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో క్విస్ ఫెస్ట్-2025 కార్యక్రమం శనివారం రెండోరోజు ఉత్సాహంగా సాగింది. టెక్నికల్, కల్చరల్, స్పోర్ట్స్ కార్యక్రమాలలో వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారని క్విస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీ గాయత్రి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే క్విస్ ఫెస్ట్ ఈసారి మరింత ఉత్సాహంగా జరుగుతోందని చెప్పారు. దేశంలోని చాలా రాష్ట్రాల నుంచి విద్యార్థులు వచ్చి ప్రదర్శనలు ఇచ్చారన్నారు. అనేకమంది ఆన్‌లైన్ ద్వారా కూడా పేపర్ ప్రజంటేషన్ ఇచ్చినట్లు తెలిపారు. ఇక టెక్నికల్ ఎక్స్ పోలో భాగంగా నిర్వహించిన పేపర్ ప్రజంటేషన్, రివైవ్, రీయూజ్, రీసైకిల్ థీమ్ ఎక్స్ పో, టెక్ క్విజ్, టెక్ ఫన్, పోస్టర్ ప్రజంటేషన్, గ్రూప్ డిస్కషన్ తదితర అంశాల్లో 40 కాలేజీల నుంచి దాదాపు 700 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారని వెల్లడించారు. వారు ప్రదర్శించిన అన్ని అంశాలను స్క్రూటినీ చేసి బహుమతులు సాధించిన వారికి జ్ఞాపికలు, ప్రశంసపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. స్పోర్ట్స్‌లో పలు కాలేజీలకు చెందిన దాదాపు 1200 మంది అథ్లెట్లు పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు సైతం ఉత్సాహంగా సాగాయి. క్విస్ స్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మ్యూజికల్ కాన్సర్ట్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సింగర్ సమీర భరద్వాజ్ తన పాటలతో ఉర్రూతలూగించారు. ఇక బ్యాండ్ కాన్సర్ట్‌లో వారి సంగీతానికి విద్యార్థులు నృత్యాలు చేసి కేరింతలు కొట్టారు. నేడు ముగింపు సభ, ఫౌండర్స్ డే నిర్వహించనున్నారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి వ్రతాలు



ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి, సామూహిక సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: జిల్లా వ్యాప్తంగా శనివారం భీష్మ ఏకాదశి వ్రతాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఒంగోలు నగరంలోని కేశవస్వామిపేటలో గల ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో, గాంధీరోడ్డులోని వెంకటేశ్వరస్వామి మందిరంలో, రంగారాయుడు చెరువు దగ్గర శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో, సమతా నగర్‌లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌లోని వెంకటేశ్వరస్వామి మందిరంలో, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న వెంకటేశ్వరస్వామి మందిరంలో, రామ్‌నగర్‌లోని అనంత కోదండ రామస్వామి దేవస్థానంలో, గాంధీ రోడ్డులోని రామాలయంలో, మంగమూరు రోడ్డు ఐశ్వర్యనగర్ సీతారామ లక్ష్మణ మందిరంలో, నగరంలో వివిధ ఆలయాలలో సామూహిక రమా వసుంధర సమేత సత్యనారాయణస్వామి వ్రతాలను వైభవంగా నిర్వహించారు. సాయంత్రం మహిళా భక్తులచే విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు.

నులి పురుగులు హాని కలిగిస్తాయి

- జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి వెంకటేశ్వర్లు

ఒంగోలు సిటీ: నులిపురుగులు పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు హాని కలిగిస్తాయని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి టి.వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 10వ తేదీ నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల దినోత్సవంపై శనివారం స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ముఖ్య అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరితో ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని తెలిపారు. ఏడాది నుంచి రెండేళ్లలోపు పిల్లలకు అర మాత్రను నీళ్లలో కరిగించి మింగించాలని చెప్పారు. ఒకరోజు ముందే ఎంపీడీవోల ఆధ్వర్యంలో స్కూల్ టీచర్లకు మాత్రలు పంపిణీ చేయాలని చెప్పారు. నులిపురుగులు రక్తహీనత కలిగిస్తాయని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చన్నారు. నులిపురుగుల వల్ల పిల్లల హాజరు తగ్గుతుందని, నులిపురుగుల నివారణకు సకాలంలో సరైన డీవార్మింగ్ అవసరమని అన్నారు. దేశ వ్యాప్తంగా నులిపురుగుల నివారణ దినోత్సవం చేపట్టినట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ బడులు, కాలేజీల్లో వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చేతులు శుభ్రంగా కడిగిన తర్వాతే మందులు మింగించాలని, ఆ తర్వాత రెండు గంటల పాటు ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, స్కూల్ టీచర్లు పిల్లలను గమనిస్తూ ఉండాలని సూచించారు. స్కూలు పిల్లల డైరీలలో ముందుగానే రాసి నులిపురుగుల నివారణ కార్యక్రమం గురించి తల్లిదండ్రులకు తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో బాల స్వస్థ్య (ఆర్‌బీఎస్‌కే) ప్రోగ్రాం అధికారి డాక్టర్ భగీరధిదేవి పాల్గొన్నారు.